# మన దేశం అసలు పేరు 'హోదు'

## Our continet original name "HODU"



బండారు దేవరాజు
సెల్: 9949145133

ప్రస్తుత మన దేశంలో హేతుబద్ధమైన అభివృద్ధికంటే, దేశానికి ఉన్న ఇండియా-భారత్-హిందూ అనే పదాలతో నిష్ప్రయోజనమైన చర్చ నడుస్తుంది. దీనికి ముఖ్యకారణం అనూహ్యమైన కృతిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటిలెజెన్స్) ను వినియోగించే కాలంలో కూడా కుల, మత, సామాజిక దురాభిప్రాయాల నుండి ప్రజలకు మార్పును కోరే రక్తమాంసాలు లేకపోవటమే. గత చరిత్రను పరిశీలిస్తే, మన భూ ఖండంలో వివిధ భాషలు మాట్లాడే వివిధ జాతుల పేర్లతో చిన్నచిన్న రాజ్యాలుండేవి. కాని సమగ్రమైన దేశీయ సరిహద్దులు మొదలైన వ్యవహారాలు వారికి తెలియవు. ఇలాంటి రాజ్యాలన్నింటిని జయించి, వాటిని పరిపాలనకు అనుకూలంగా ఒకే రాజ్యంగా బ్రిటీషువారు మార్చివేశారు. పశ్చిమవాసులైన గ్రీకులు క్రీ.పూర్వం 400ల సంవత్సరాల నాటికి ఇండియో అని మన ఖండానికి పేరు పెట్టారు. రోమా చక్రవర్తుల కాలంలో లాటిన్ భాషలో ఇండియా అని పిలిచారు. బ్రిటీషువారు కూడా ఇండియా అనే పదాన్ని ఉ యోగించారు.

స్వాతంత్రోధ్యమ కాలంలో భరత లేక భారత దేశమనే భావన ఉనికిలోనికి వచ్చింది. కాని, డా॥ బి.ఆర్.అంబేద్కర్ రాజ్యాంగ రచనకాలంలో ఈ దేశానికి ఏ పేరుపెట్టాలనే విశేషమైన చర్చ జరిగింది. అప్పుడు భారత్-హిందూ అనే పదాలకు సరైన నిర్వచనం చారిత్రక ఆధారాలు గుర్తించలేక పోయారు. అందుచేత, అప్పటికే ప్రపంచదేశాలలో గుర్తింపు కలిగిఉన్న ఇండియా- భారత్ అనే రెండు పదాలను కూడా వినియోగించవచ్చని, ఆనాటి పెద్దల సభ నిర్ణయించి రాజ్యాంగంలో పొందుపరచారు.

పురాతన (సనాతన) యూదు పరిశుద్ధ (కెతూభీమ్)ల చరిత్ర గ్రంధాలలో పర్షియాదేశ రాణి హదస్సా(ఎస్తేరు) గ్రంధం మనచరిత్ర తెలియజేస్తుంది. ఆనాటి పర్షియా(ఇరాన్) సామ్రాజ్యంలో హోదు' (HODU) అనబడిన మన దేశ రాజసంస్థానం గురించి వ్రాయబడింది. ఆ కాలంలో మన భూఖండం ఈజిప్టు (గుప్త, మిశ్ర, మిశ్రాయీమును ఆనుకొని ఉన్న లెమూరియా ప్రక్కన ఉండేది. క్రీ.పూర్వం 700ల సం॥రాల నాటికే మహాజ్ఞాని రాజైన సాలోమోను (యేదిద్యా) సృష్టికర్తయైన దేవుని ఘనపరచటానికి భూమికి నట్టనడమన ఉన్న యెరూషలేము పర్వతాలపై మందిరాన్ని నిర్మించాడు. ఆ మందిర పునాదులలో, గోడలలో నిర్మించటానికి, హోదు నుండి తెచ్చిన చందనపు మ్రానులను ఉపయోగించాడు. అలాగే, బంగారం, రత్నాలు, నెమళ్లు, కోతులు, పత్తి, మిరియాలు మొదలైన సుగంధ ద్రవ్యాలను కూడా తెప్పించాడు.

మాదియ-పారశీక(ఇరాన్) చక్రవర్తులు సైరస్ దిగ్రేట్, అహేశ్వరోష్(జారెక్సిస్) ఈ హోదును ఏలుబడిచేశారు. క్రీ.పూ 450-400ల సం॥రాలలో హోదు నుండి ఇథియోపియా(కూపూ) దేశానికి సముద్రమార్గం కనిపెట్టాడు. అహెశ్వరోష్ వేయించిన బెహోస్టిన్ దైవశాసనం (Daiva Inscription)లో మొదటి దేశం పేరు హోదు. ఆఫ్ఘనిస్తాన్లోని గాంధార, ఆర్యావర్త(పర్షియారాజ వర్తక వ్యాపార కేంద్రం) మొదలైనవి మన హోదుకు సంబంధించిన గుర్తింపబడిన ప్రాంతాలు. హీబ్రూ భాషా పదానికి యెహోదీయులు లేక యూదులు నివశించిన దేశమని అర్థం. కేరళ ప్రాంతంలోనికి వలసవచ్చి నివశిస్తున్న యూదులను నేటికి మాల (Mallah, Jewish centre of Refuge) అని పిలుస్తున్నారు. మాల అనగా యూదు పరదేశులని అర్థం. మనదేశంలో ఉన్న సుమారు 143 కోట్ల జనాభాలో 40 శాతం మంది యూదుల జీన్ కలిగి ఉంటారని డి.యన్.ఏ టెస్టుల ద్వారా అర్థంచేసుకోగలం.

భూగోళం (అట్లాస్) చరిత్ర ప్రకారం పరిశీలిస్తే క్రీ.పూ 200-100 సం॥రాల మధ్యకాలంలో, గ్రీకులను నాశనం చేసిన రోమీయుల కాలంలో, ఈజిప్టును ఆనుకొనిఉన్న లెమూరియా ఖండం సముద్రంలోనికి దిగిపోయింది. అందుచేత మన హోదు ఖండం సముద్ర జలాలపై కదలుచూ ఒక దీవిలాగ మారింది. తరువాత చైనాలోనికి చొచ్చుకుపోయి అక్కడే ఉండి పోయింది. ఫలితంగా హిమాలయ పర్వతాలు ఏర్పడ్డాయి. దీవిగా ఉన్న కాలంలో జుంజుమీమ్, హితీయ (హిటైట్) మొదలైన కనాను, ఆఫ్రికా జాతికి చెందిన ప్రజలు నివశించారు. కనుకనే దీనికి జంబూద్వీపం అనికూడా పేరు పెట్టారు. ఇప్పటికీ జుంజు అనే ఇంటి పేరుగలిగిన కనానీయులు మన తెలుగు వారి మధ్య జీవిస్తున్నారు. ఈ ఖండంలోని ప్రజలు నల్లని వారు కనుకనే, గ్రీకులు నల్లనివారని తెలియజేసే ఇండియో అని పేరు పెట్టారు.

యూదుల రాజైన సొలోమోను విశేషమైన వనరులుగల ప్రాంతాన్ని పరిశీలించి దానికి హెబ్రీభాషలో హోదు(గొప్ప)దేశం అని పేరుపెట్టాడు. కనుక ఇండియా- భారత్ అనే పదానికి ఉన్న వివరాల కంటే, హోదు అనే పదమే ప్రామాణికతను కలిగి ఉంది. దీనిని గుర్తించకుండా, దేశానికి పొసగని పదాలను ఆపాదిస్తున్నారు. తాత్కాలిక ప్రయోజనం కొరకు, కేంద్ర ప్రభుత్వానికి భిన్నంగా, ఇండియా అనే పదంతో ప్రతిపక్ష్యాలు ఐక్యకూటమిగా మారాయి. కాని యన్డీఏ, యుపిఏ పదాలవలే అది కూడా మరుగున పడుతుంది. ఇక హిందూ అనే పదం భారతీయ భాషలలో లేదు. అది పర్షియా(ఇరాన్) పురాతన భాషయైన పహ్లవీకి సంబంధించినది. హిందూ అనే పదాన్ని ఇరాన్, టర్కి మొదలైన దేశాల వారు మనదేశంలో కొందరిని గుర్తించటానికి ఉపయోగించారు. హిందూ అనే పదానికి నల్లనివారు, శాసనోల్లంఘనులు (చట్టాలను అతిక్రమించేవారు) గజదొంగలు, బానిసలు అనే అర్థాలున్నాయి. కనుకనే, హిందూ అనే పదాన్ని వాడవద్దని కొందరు దేశ ప్రేమికులు సభలు పెట్టి, పుస్తకాలు ప్రచురించి తమ అసమ్మతిని వ్యక్తం చేశారు. ప్రపంచ జ్ఞానచైతన్యాల చక్రభ్రమణం ప్రకారం, క్రీ.పూర్వం 6వ శతాబ్దం మొదలుకొని, క్రీ.శకం 16వ శతాబ్దివరకు గ్రీకు భాషలో గ్రీకు(యవను)ల తత్వజ్ఞానం ప్రపంచాన్ని జ్ఞానతృష్ణతో ఓలలాడించింది. ఆ తరువాత బ్రిటీషువారి ఇంగ్లీషుభాషా ప్రభావంతో కొత్తపుంతలు త్రొక్కి అనంత జ్ఞాన ప్రహేళికలను సృష్టిస్తుంది. నేటి కాలపు గ్లోబలైజేషన్ యూనివర్సలైజేషన్ ప్రభావాలతో మనుగడ సాగించే పరిస్థితులలో జీవిస్తున్నాము. ఏదేశంలోలేని విధంగా పౌరాణిక గాధలకు ప్రాధాన్యమిచ్చి, చారిత్రక నేపధ్యమున్న పేరు మార్చాలని కోరుతుంది నిలువు బొట్లు పెట్టుకోని వైష్ణవులు మాత్రమే. గత కాలపు శైవ, బౌద్ధ, జైన, శిక్కు, లింగాయత్, పారసీక, క్రైస్తవ, ముస్లీం, యూదు, గ్రామదేవతల వ్యవస్థలతో పాటు హేతువాదులు, విజ్ఞాన శాస్త్రవేత్తలు మొదలైన వారిలో ఎవరూ దేశం పేరు మార్చాలని కోరటంలేదు. కనుక, ఇండియా-భారత్-హిందూ అని పదాలపై వాద వివాదాలు చేసి సమయాన్ని వృధాచేయటం కంటే, మన దేశం లేక ఖండం అసలు పేరు హోదు అని పిలవాలి. లేకుంటే ఇండియా-భారత్ అని రాజ్యాంగంలోని పదాలను పలకటం ద్వారానే మన పౌరస్పృహ ఇనుమడిస్తుంది.

